క్లుప్తంగా

చింతపల్లిలో శ్రీరాముని శోభాయాత్ర



కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో శుక్రవారం రాములవారి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్ఠ సందర్భంగా భక్తులు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని జనార్ధనస్వామి ఆలయం నుంచి శ్రీరాముని చిత్రపటంతో జై శ్రీరామ్ నినాదాలతో శోభాయాత్ర జరిగింది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది. ప్రజలు శ్రీరాముని చిత్రపటం ముందు వారుపోసి కొబ్బరి కాయలు కొట్టి హారతులిచ్చి పూజలు చేశారు. గ్రామంలోని అన్ని ప్రధాన ఆలయాలలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పెద్దలు పాల్గొన్నారు.

వీఆర్ఏ గురవయ్య మృతి

మట్టి ఖర్చులకు రూ.15వేలు అందజేత

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామానికి చెందిన వీఆర్ఏ అందుగుల గురవయ్య (73) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అధికారులు గురవయ్య మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15వేలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చపారపు లచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి రామాంజిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగాల రాఘవాచారి, నాగరాజు, డీటీ రాజశేఖర్ నాయక్, వీఆర్వో, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



కారెంపూడి: ఎస్టీయూ మండల కౌన్సిల్ సమావేశం స్థానిక ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా బి.సురేష్, ప్రధాన కార్యదర్శిగా వీవీ రమణానాయక్, ఆర్థిక కార్యదర్శిగా ఎస్ వీరాంజనేయులును ఎన్నుకున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎన్నికైన అన్నం శకుంతలను సన్మానించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.గంగాధరబాబు, మద్దినేని వెంకటకోటయ్య తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు ఉత్సవాలు

మాచవరం: మండలంలోని వేమవరం, మాచవరం, మల్లవోలు గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యు.వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్యలు తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహించి, పెంచిన మూడు వేల రూపాయల పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. కావున ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు.

మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా సాగర్



గురజాల : వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా పేరుపోగు సాగర్‌ను నియమిస్తూ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ తెలిపారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్లగుడిపాడు గ్రామానికి చెందిన పేరుపోగు సాగర్‌ను యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగిందని సాగర్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. బాధ్యతలు స్వీకరించి సాగర్ మాట్లాడుతూ పదవి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చని చెట్లకు నిప్పు



చెట్టుకు నిప్పు అటించిన దృశ్యం



నిప్పు అటించడంతో నేల కూలిన చింతచెట్టు

పచ్చని చెట్లకు కొందరు నిప్పు పెట్టడంతో మానవుని మనుగడకు ప్రమాదం పొంచి ఉంది. కొందరు తమ స్వార్థప్రయోజనాల కోసం అజ్ఞానంగా వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పచ్చని చెట్లకు నిప్పు అంటించడంతో ఆ చెట్లు నేలకొరుగుతున్నాయి. ఇటీవల కాలంలో మండలంలోని పలు గ్రామాల మధ్య అనేక చెట్లకు కొందరు నిప్పు అంటించడంతో బాటచారులకు నీడను ఇచ్చిన చెట్లు నేల కూలుతున్నాయి.

–రెంటచింతల

పారదర్శకంగా పింఛన్లు

నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు

గురజాల : ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తూ పారదర్శకంగా పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు వవన్మయి వీరారెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని గురజాల సచివాలయాల పరిధిలో పెరిగిన పింఛన్ల నగదు పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ క్రమంగా పెంచుతూ మాట నిలబెట్టుకున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రతి ఒక్కరు ఆనందంగా జీవించాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యాకుమారి ప్రసాద్, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అనిల్‌కుమార్, షేక్ నాగులుమీరా, కందిమళ్ల శ్రీను, ఏసోబు, నారాయణ, కర్రా గిరిబాబు, కౌన్సిలర్లు, నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పింఛన్ అందిస్తున్న నగర పంచాయతీ చైర్ పర్సన్ తదితరులు

నేడు పింఛన్‌ల పంపిణీ

మాచర్ల: పట్టణంలోని పింఛను లబ్ధిదారులకు పెంచిన పింఛన్‌లు నెహ్రూనగర్ వీవీఎస్ గార్డెన్‌లో శనివారం పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు శుక్రవారం తెలిపారు. పట్టణంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు వీవీఎస్ గార్డెన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. నూతనంగా మంజూరైన వారికీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గురజాల: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని మాడుగుల గ్రామానికి చెందిన కె.వెంకటనర్సయ్య (37) శుక్రవారం సాయంత్రం పొలంలో ఉన్న బోరుకు మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గమనించి బంధువులకు సమాచారం అందించారు. నర్సయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ఇద్దరు సంతానం, భార్య ఉన్నారు.

ప్రతి వార్డు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- సురక్షిత మంచినీటిని అందించటమే ప్రభుత్వం లక్ష్యం
- వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి ఒక్క పేద కుటుంబాన్ని అభివృద్ధి చేయటమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని, అందులో భాగంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి ప్రజలకు సేవలందించే అవకాశాన్ని కల్పించాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని తూర్పుబావి ప్రాంతంలో రూ.21లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్, డ్రైనేజ్ పనులను ఆ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్, రహమాన్‌ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. పట్టణంలో ప్రతి వార్డును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో వాటర్‌ప్లాంట్ పురపాలక సంఘం ద్వారా నిధులు కేటాయించామన్నారు. అదే విధంగా అనేక ప్రాంతాలలో మంచినీటి సౌకర్యం ఏర్పాటు కోసం చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, నూతనంగా నిర్మాణమైన డ్రైనేజ్ పనులను పరిశీలించారు. అంతకుముందు దివంగత సీఎం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, అబ్దుల్ జలీల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆయా వార్డు కౌన్సిలర్లు షేక్ సుభాని, కరిముల్లా, మదార్‌సాహెబ్, మాచర్ల సుందరరావు, మందా సంతోష్, మైనార్టీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్ కళ్యాణి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పలపాటి జాని, బూదాల మరియమ్మ, ట్రాక్టర్ కరిముల్లా, షేక్ సులేమాన్ తదితరులున్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

సంక్రాంతి ముగ్గుల పోటీలు

పిడుగురాళ్ల: చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు చింతలపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీ మాచవరంలో సంక్రాంతి పండుగ తెలిపే ముగ్గుల పోటీలు, 11వ తేదీన గురజాలలో సోషల్ మీడియాపై ముగ్గుల పోటీలు, 12వ తేది దాచేపల్లిలో రైతు, వ్యవసాయంపై ముగ్గుల పోటీలు 13వ తేది పిడుగురాళ్ల పట్టణంలో భారత దేశ సమగ్రతపై ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించి ప్రథమ బహుమతిగా ఫ్రిజ్, రెండవ బహుమతి ఎల్ఈడీ టీవీ, తృతీయ బహుమతి మిక్సర్ గ్రైండర్‌తోపాటు ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులుగా చీరలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 100 మందికి మాత్రమే పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యలో రాణించి ఉన్నతంగా ఎదగాలి

మాచవరం: విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నతంగా ఎదగాలని తహసీల్దారు ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలో వసతులు, జగనన్న గోరుముద్ద, బంగారుతల్లి, విద్యాజ్యోతి పథకాల అమలు, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహ పథకాలపై విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువులో బాగా రాణించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాగిడి నరేష్, హెచ్‌ఎం సురేష్‌బాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నీలం వెంకటేశ్వర్లు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న తహసీల్దారు ప్రసాద్ తదితరులు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ విజయానాయక్



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ లక్ష్మి

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సుమారు 250 మంది వైద్య శిబిరానికి వచ్చి డాక్టర్లకు చూపించుకుని ఉచితంగా మందులు పొంది సంతృప్తిగా ఇళ్లకు వెళ్లారు. ఆరోగ్య పరీక్షల ఫలితాలు తీసుకుని తమకున్న అనారోగ్య సమస్య ప్రకారం స్పెషలిస్ట్ డాక్టర్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు పొందారు. గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ విజయానాయక్ పర్యవేక్షణలో వైద్య శిబిరం కొనసాగింది. స్త్రీల ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వై లక్ష్మి, డాక్టర్ ఆర్ వాసు, ఎండీ జనరల్, డాక్టర్ విజయానాయక్ రోగులను పరీక్షించారు. కంటి వైద్య నిపుణులు కె.శ్రీధర్ కంటి పరీక్షలు నిర్వహించి వారికున్న కంటి సమస్యలను నమోదు చేసుకున్నారు. కళ్లజోళ్లు, ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. మొత్తం 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

వైద్య సిబ్బంది సరళ, శ్రీనివాసరావు, వెంకటరత్నం, రత్నకుమారి, సుబ్బారెడ్డి, సాగర్, రాము, రాణి, శాంతకుమారి, సునీత, షాహీనా, రామ్మోహన్, ఆశా వర్కర్లు, 104, 108 సిబ్బంది వైద్య సేవల్లో పాలుపంచుకున్నారు. గ్రామ సర్పంచ్ మాదాసు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు మందాళ్ల అంజిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గామాలపాడులో చోరీ

దాచేపల్లి: మండల పరిధిలోని గామాలపాడులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన ఎర్రగడ్డ కమలమ్మ నివాసంలోకి గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లి బీరువా పగులగొట్టి అందులో ఉన్న 34 గ్రాముల బంగారం, రూ.55వేలు నగదు చోరీ చేశారు. శుక్రవారం ఉదయం బీరువా తెరిచి ఉండటం గమనించిన కమలమ్మ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై దాసరి శివ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు.

161 మందిపై బైండోవర్ కేసులు

శావల్యాపురం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు, అల్లర్లు జరగకుండా ఉండటానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. వినుకొండ రూరల్, ఈపూరు, శావల్యాపురం, బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల పోలీసు స్టేషన్ల పరిధిలో గ్రామాల్లోని రాజకీయ పార్టీలకు చెందిన 161 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ ఈ సందర్భంగా చెప్పారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నేతలకు నిబంధనలు వివరించామన్నారు. వాటిని అతిక్రమిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో పోలీసుల నిఘా ఉంచామన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎస్సై తుళ్లూరి తిరుపతిరావు, రైటరు శ్రీనివాసరావు ఉన్నారు.



బైకు చోరీపై కేసు నమోదు

శావల్యాపురం: గుంటుపాలెం గ్రామంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదైంది. వివరాలు మేరకు.. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు తన బైకు అర్ధరాత్రి చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అలాగే పిచికలపాలెం గ్రామంలో ఇటీవల ఇదే తరహాలో బైకులు చోరీకి గురైనట్లు స్థానికులు చెప్తున్నారు. పోలీసులు బైకు చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైఎస్సార్ బీమా తొలి సాయం అందజేత

కారెంపూడి: మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన పాస్టర్ పాలెపోగు కోటేశ్వరరావు (50) కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తొలి సాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గ్రామ సర్పంచ్ జడ్డా కోటిరెడ్డి పంపిణీ చేశారు. కోటేశ్వరరావు భార్య లక్ష్మికి నగదును శుక్రవారం సాయంత్రం సర్పంచ్ అందించారు. పాస్టర్ మృతి పట్ల సర్పంచ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

అక్రమ మద్యం పట్టివేత



నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. నకరికల్లు మండలం గుళ్ళపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించి, అక్రమంగా మద్యం కలిగి ఉన్న గుత్తికొండ మీరసను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే చేజర్ల గ్రామంలో తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీకి వినియోగించే 500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. తమ రాకను ముందే పసిగట్టిన నిందితులు పరారయ్యారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.